క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెడన: గుడివాడ, పామర్రు 132 కేవీ ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని పెడన ఏడీఈ సీహెచ్ మాణిక్యలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో వాటి పరిధిలోని పెడన నియోజకవర్గంలోని గూడూరు, కృత్తివెన్ను మండలాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ప్రాంతాన్ని బట్టి రెండు లేదా మూడు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఆధునికీకరణలో భాగంగా..

అవనిగడ్డ: నున్న – గుడివాడ ట్రాన్స్‌మిషన్ లైన్ ఆధునికీకరణలో భాగంగా గుడివాడ 220 కేవీ ఉపకేంద్రం, గుడివాడ – పామర్రు – 2 ఫీడర్ కానుమోలు – పామర్రు 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం 10 గంటల పాటు విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట, కానుమోలు విద్యుత్ కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని ఆయన సూచించారు.

నేడు సైనికులకు మద్దతుగా తిరంగా భారీ ర్యాలీ

మోపిదేవి: భారత సైనికులకు సంఘీభావంగా మండల పరిషత్, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8.30 గంటలకు తిరంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం నుంచి మోపిదేవి ప్రధాన గుడి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం అమరవీరులైన జవానులకు నివాళులర్పిస్తామన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు, ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎంపీడీవో అరుణకుమారి బాధ్యతల స్వీకారం



పెడన: పెడన ఎంపీడీవోగా ఎ.అరుణకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అవనిగడ్డ మండలం ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై పెడనకు వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, ఏవో శిరీషకుమారి ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవో అరుణకుమారిని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఫర్హతుల్లా, పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ అసంబద్ధ విధానాలపై నేడు ఏపీటీఎఫ్ ధర్నా

మచిలీపట్నంఅర్బన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రామారావును గృహ నిర్బంధంలో ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది ఉపాధ్యాయుల హక్కులను కాలరాయడమేనన్నారు. ఉపాధ్యాయుల ఐక్యతతో ప్రభుత్వాన్ని చైతన్యపరిచేలా ధర్నా కొనసాగుతుందని చెప్పారు.

సీసీఆర్సీ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

కోడూరు: కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రాల(సీసీఆర్సీ కార్డులు) కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనునాయక్ మంగళవారం తెలిపారు. పంట భూమి ఉన్నా, లేకపోయినా మరొకరి దగ్గర భూమిని కౌలుకు ఒప్పందంతో తీసుకుని పెట్టుబడి పెట్టి పంట సాగు చేసే వారికి రెవెన్యూ శాఖ సీసీఆర్సీ కార్డులు జారీ చేస్తుందన్నారు. పండించే పంటను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు కార్డులు కలిగిన ఉన్న రైతులకు ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటకు నష్టం జరిగితే బీమా వర్తిస్తుందని చెప్పారు. భూమి యజమాని పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్, కౌలుదారుడి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్‌పోర్టు ఫొటోలతో స్థానిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

ట్రాఫిక్ చక్రబంధంలో రహదారులు

- పెడనలో ప్రతి రోజూ నిలిచిపోతున్న వాహనాలు
- దుకాణాల ముందు వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు
- పట్టించుకోని దుకాణాల యాజమానులు
- ప్రజలకు తప్పని అవస్థలు



పట్టణంలోని ప్రధాన రహదారిలో నిలిచిన ట్రాఫిక్



ట్రాఫిక్ నిలవడంతో ముందుకు కదలని వాహనాలు



పెడనలోని బంటుమిల్లి రోడ్డు సెంటరు వద్ద ఇష్టారాజ్యంగా నిలిపిన ఆటోలు

పెడన: పెడన పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించినా.. పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడే వాహనాల రాకపోకలు కొనసాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరో వైపు ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో పాటు దుకాణాలకు వెళ్లే వారు తమ వాహనాలను రోడ్డు మార్జిన్లలో కాకుండా రోడ్లపైనే పెడుతున్నారు.

దీనికి తోడు ఆటో డ్రైవర్లు సైతం పాసింజర్లను ఎక్కించుకోవడానికి రహదారులపై ఆటోలను నిలపడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. అదే పాఠశాలలు, కళాశాలలు విడిచే సమయంలో మరీ ఇబ్బందికర పరిస్థితి. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యేవారు ఇబ్బందులు పడుతున్నారు. పెడన పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి రోడ్డు మార్జిన్‌లో పాత కూరగాయాల మార్కెట్ సమీపంలో మున్సిపల్ చెత్త డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంగా ఉంటుంది. దీంతో కొన్ని సమయాల్లో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. బంటుమిల్లి రోడ్డు సెంటర్ వద్ద ఇష్టారాజ్యంగా ఆటోలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు..



ఇప్పటికే దుకాణాల ముందు వాహనాల పార్కింగ్ చేయవద్దని దుకాణ యజమానులకు తెలియజేశాం. మరోసారి మున్సిపల్ కమిషనర్‌తో సమావేశమై దుకాణాల యాజమా నులతో సమావేశం ఏర్పాటు చేయిస్తాం. వాహనాలు నిలుపుదల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ఆటో డ్రైవర్లకు కూడా తీవ్ర హెచ్చరికలు చేస్తాం. ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలుపుదల చేసేసి ప్రయాణికులను ఎక్కించుకోకుండా మార్జిన్ వెంబడి నిలుపుదల చేసేలా సూచిస్తాం. ట్రాఫిక్‌కు ఎవరైనా అంతరాయం కలిగించనట్లు తెలిస్తే మాత్రం వారిపై శాఖాపరంగా తగు చర్యలు తీసుకుంటాం.

– జి.సత్యనారాయణ, ఎస్‌ఐ, పెడన

సబ్సిడీపై పశువుల దాణా అందజేత



దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

పెడన: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై అందించే పశువుల దాణాను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏడీఏ కార్యాలయంలో పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణాను మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన పాడి రైతులకు పశువుల దాణా రాయితీపై అందజేస్తున్నారన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏ కొనకళ్ల బాబురావు మాట్లాడుతూ.. పెడన మండలానికి 16.3 మెట్రిక్ టన్నులు దాణా వచ్చిందన్నారు. ఒక్కొ రైతుకు 50 కేజీలను అందజేస్తున్నామని చెప్పారు. 50 కేజీల దాణా ధర రూ.1,110 కాగా, రైతులకు రూ.555లకు ఇస్తున్నామన్నారు. 6.3 మెట్రిక్ టన్నులు ఎస్సీ పాడి రైతులకు కేటాయించారని, మిగిలిన 10 టన్నులు ఇతర పాడి రైతులకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్జా వెంకటనగేష్, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు శెలపాటి ప్రసాద్, శీరంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



ఘంటసాల: రైతులకు రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రాయతీపై నాణ్యమైన పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. రాయితీ పోనూ జీలుగ కేజీ రూ.61.50, జనుము కేజీ రూ.54.50, పిల్లి పెసర కేజీ రూ.90లకు అందిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో రైతుకు 5 ఎకరాలకు వరకు ఇస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ముమ్మనేని రవి ప్రసాద్, మద్దాల వెంకటేశ్వరరావు, బెల్లంకొండ అమలేశ్వరరావు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు..

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో రైతులకు వరి విత్తనాలు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ పరిశోధనా క్షేత్రం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగేంద్రరావు మంగళవారం తెలిపారు. ఈ విత్తనాలను ఉపయోగించుకుని రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎంసీఎం–100 రకం కేజీ రూ.42, ఎంసీఎం–103 రకం రూ.47, ఎంసీఎం –125 రకం రూ.50 లతో పాటు మినుము విత్తనాలు ఎల్‌పీజీ 884 రకం విత్తనం కేజీ రూ.150 లకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు 94408 53096 నంబరును సంప్రదించాలని సూచించారు.

17 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

పెడసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెడసనగల్లులోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు సూరపునేని గంగా భవాని పేర్కొన్నారు. 17న అంకురార్పణ, 18న చతుర్దశ కలశస్నపన, శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం, 19న శ్రీ లక్ష్మీ నరసింహహోమం, సామూహిక కుంకుమార్చన, గ్రామోత్సవం, 20న చక్రస్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

చల్లపలి: బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాలను నిర్మూలించటంతో పాటు 14 సంవత్సరాలలోపు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపి చదివించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చల్లపల్లి సచివాలయం–1 మహిళా సంరక్షణా కార్యదర్శి వేమూరి లావణ్య అన్నారు. కిశోర వికాసం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక సచివాలయం–1 పరిధిలోని పార్వతమ్మ తోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టం పరిధిలో వచ్చే వివిధ అంశాలు, పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. బాల కార్మికుల నిషేధ చట్టం ప్రకారం 18 సంవత్సరాలలోపు పిల్లలను శారీరక శ్రమ కలిగే పనులు చేయించటం నిషేధమని అలా ఎవరైనా చేస్తే శిక్షార్హులవుతారని సూచించారు. అలాగే 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహాలు చేయటం నేరంగా పరిగణించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు గంగాభవాణి, ఈశ్వరి, శివసాయి కుమారి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సరోజిని ఆరోగ్యం పరిస్థితిపై ఆరా తీస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ ప్రమోద్ కుమార్

ఘంటసాల: ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న నాణ్యమైన సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ అన్నారు. ఘంటసాల అంబేడ్కర్ నగర్‌కు చెందిన వంపుగాని సరోజిని పురిటి నొప్పులతో బాధపడుతూ ఘంటసాల పీహెచ్‌సీకి రాగా పరీక్షించిన వైద్యులు వేమూరి ప్రమోద్ కుమార్, వెంకటేశ్వరరావు ఆస్పత్రిలో సోమవారం సాయంత్రం సాధారణ కాన్పు చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. వైద్య పరీక్షల అనంతరం తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వైద్యులకు సరోజిని భర్త సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవం చేయడానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ ఏడాది ఐదుగురు గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేశామన్నారు. స్టాఫ్ నర్సు అంజలీ దేవి, ఏఎన్‌ఎం సుజాత, ఎఫ్‌ఎన్‌ఓ రాజమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు చేతివృత్తులతో స్వయం ఉపాధి పొందాలి



ధ్రువపత్రాలు అందుకున్న మహిళలతో నాగేశ్వరరావు తదితరులు

మచిలీపట్నంటౌన్: మహిళలు చేతివృత్తులను నేర్చుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని సంతోషంగా ముందుకు తీసుకువెళ్లాలని 31వ డివిజన్ కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కాలేఖాన్‌పేట, శారదానగర్ ప్రాంతాల్లో హోప్ ఫర్ టుడే సంస్థ ఆధ్వర్యంలో ఆరు నెలలుగా మహిళలకు జరుగుతున్న ఉచిత టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అల్ఫా ఒకేషనల్ సెంటర్‌లో 6 నెలలుగా శిక్షణ పొందిన 30 మంది మహిళలకు నాగేశ్వరరావు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కుటుంబ జీవనం భారంగా మారిన నేపథ్యంలో భర్తల సంపాదనకు తోడుగా భార్యలు కూడా చేతి వృత్తుల ద్వారా కొంత ఆదాయాన్ని సంపాదించడం తోడ్పాటునిస్తుందన్నారు. అలాగే వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి ప్రయోజకులుగా చేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ పీపీ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, హోప్ ఫర్ టుడే సంస్థ ఇన్‌చార్జి బ్రదర్ జోసఫ్, సంస్థ మచిలీపట్నం కోఆర్డినేటర్ అనీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులను రుణ విముక్తులను చేయాలి



గుడివాడలో నిరసన వ్యక్తం చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు

గుడివాడటౌన్: టిడ్కో కాలనీ ఏర్పాటులో భాగంగా లబ్ధిదారులు చెల్లించాల్సిన రుణాలను ప్రభుత్వం రద్దుచేసి రుణవిముక్తులను చేయాలని కాలనీ అభివృద్ధి కమిటి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే పూర్తిగా రుణాలు రద్దు చేస్తామని, మౌలిక వసతులలో మిగిలినవి పూర్తిచేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంచినీటితో నింపడం లేదన్నారు. కాలనీలో పలు ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు సంబంగి రంగమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో అప్రమత్తత అవసరం



దేవరకోట(ఘంటసాల): సోషల్ మీడియాతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఘంటసాల సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి చెప్పారు. మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఘంటసాల మండలం దేవరకోట, ఘంటసాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం వేసవి తరగతుల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు చట్టాలు, పోక్సో కేసు, ఇతర చట్టాలతో పాటు సమాజంలో బాలికలు ఎలా ఉండాలి, తదితర అంశాలపై వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అలాగే తాడేపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రం 1లో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీపీఎస్ ప్రతినిధి సీహెచ్.నాగ భవాని, ఈ.చంద్రమ్మ, మాధురి, రాజ్యలక్ష్మి, ఏఎన్‌ఎం సునీత, రాణి, జయలక్ష్మి, జి.సునీత, నాగ స్వర్ణ, దివ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అన్నపూర్ణాదేవి ఆలయం ముస్తాబు



దాతలు బహూకరించిన వెండి నామ నాగ శివలింగం

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని భావదేవరపల్లిలో ఈ నెల 17వతేదీ నుంచి జరుగనున్న శ్రీగణపతి శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి మంగళవారం చెప్పారు. ఆధ్యాత్మిక సేవల్లో భాగంగా 17న ఉదయం 9 గంటలకు ఆకెళ్ల దేవనాథన్ శర్మ నేతృత్వంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, దేవతామూర్తులకు నూతన వస్త్రాలంకరణ పూజలు జరుగుతాయన్నారు. 18న దేవతామూర్తులకు మహా సంప్రోక్షణ, శాంతి హోమం, పంచ హారతులు, అన్నపూర్ణ దేవి, కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం మహోత్సవం, 19న అభిషేకాలు, పూర్ణాహుతి, సాయంత్రం 6గంటలకు గ్రామోత్సవం తదుపరి ద్వాదశ ప్రదక్షిణలు, ధ్వజారోహణ నిర్వహిస్తామని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కాశీవిశ్వేశ్వరుని వేడుకలు జయప్రదం చేయాలని కోరారు.

నాగ శివలింగం బహూకరణ

ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో స్థిరపడిన గ్రామస్తుడు పూషడపు శంకర్, మాధురి దంపతులు రూ.23 వేలు విలువైన వెండి నామ నాగ శివలింగం, స్వామివారి బొట్టు ఆలయానికి బహూకరించినట్లు నిరంజనరావు తెలిపారు.

భక్తులకు సదుపాయాలు మెరుగుపర్చాలి



షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

మోపిదేవి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం సదుపాయాలు మెరుగుపర్చాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మండల కేంద్రం మోపిదేవిలో వేం చేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో వంటశాల, నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తులకు వడ్డించే ఆహార పదార్థాలు శుచి, శుభ్రత, నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా తయారు చేయించాలని అధికారులను ఆదేశించారు. కోనేరు ప్రాంగణంలో దేవస్థానం నిధులు రూ.2.75 కోట్లతో నిర్మిస్తున్న రూములు, షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలించి, నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనులు, జరుగుతున్న నిర్మాణ పనుల తీరును ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన వెంట ఆలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కనులపండువగా నాగేశ్వరస్వామి ఊరేగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఖోజ్జిల్లిపేటలో వేంచేసి ఉన్న శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి ఊరేగింపు కనులపండువగా సాగింది. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన నంది వాహనంపై స్వామి వారు ఆశీనులు కాగా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా బాణాసంచా, మేళతాళాల వాయిద్యాల నడుమ ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. వీధుల్లో ఊరేగింపుగా విచ్చేసిన స్వామి వారిని నగర ప్రజలు దర్శించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి, పండ్లు, ఫలహారాలు ఇచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. కడవకొల్లు కృష్ణ ఇంటి వద్ద దొంగల దోపిడీ వేడుకను నిర్వహించారు. ఉదయం ఆలయంలో కొట్టములు, అవబృధస్నానం, వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజావరోహణం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి వై.శిరీష పర్యవేక్షించారు. బుధవారం రాత్రి ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: స్థానిక పరాసుపేటలో వేం చేసి ఉన్న శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్వామివారికి వడమాల, అప్పల మాల, తమలపాకుల దండ, తులసి మాల అలంకరించి పూజలు జరిపారు. భజన సమాజ బృందం సభ్యులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి తిక్కిశెట్టి వీర వెంకటమోహనరావు పర్యవేక్షణలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించికుని పూజలు చేసి, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కార్తికేయుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



పుట్టలో పాలు పోస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నాయకులు

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. దేశం కోసం, సైన్యం కోసం ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామంలో జాతీయ పతాకం తిరంగా జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, నాయకులు మండలి వెంకట్రామ్, శీలం అశ్వినీకుమార్, మత్తి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో సాగుతున్న ఉపాధి హామీ పనులు



ఎదురుమొండిలో వ్యవసాయ నీటి కుంట పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

నాగాయలంక: జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)2025–26 సంవత్సరం కింద నాగాయలంక మండలంలో 5,600 మంది శ్రామికులతో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నట్లు ఏపీవో టీవీఎస్ ముత్యాలు మంగళవారం చెప్పారు. ప్రస్తుతం మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.80 లక్షలతో చేపట్టిన 286 పనులు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ నీటి కుంటలు, పంటబోదెలు, పశువుల నీటి చెరువులు తదితర పనులు చేపట్టామన్నారు.

గ్రామాల్లో లేకుండా దూరప్రాంత పట్టణాల్లో ఉపాధి కూలీ జాబ్ కార్డులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ప్రశ్నించగా కొందరికి గృహ నిర్మాణాల కోసం జాబ్ కార్డులు ఇచ్చామని ఏపీవో చెప్పారు. కార్డుకు 100 పని రోజులు కల్పించాల్సిన సందర్భంలో వారం రోజుల పనికి ఒక్కో కూలీ నుంచి వంద రూపాయలు వసూలు చేస్తున్నారని, పనిలోకి రానివారికి హాజరు వేసి సంబంధిత నగదు క్షేత్ర సిబ్బంది దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలున్నాయన్నారు. అక్రమాలపై ఉన్నతాధికారులకు చెబితే పనులు కల్పించమని బెదిరింపులు చేస్తున్నారని పలువురు శ్రామికులు చేస్తున్న ఆరోపణలపై ఏపీవో వివరణ అడగగా మా దృష్టికి వస్తే తీవ్రంగా హెచ్చరిస్తామని, ఏ పంచాయతీ లోనైనా ఇలాంటి సంఘటనలు ఉంటే విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్య తీసుకుంటామని ఏపీవో స్పష్టం చేశారు.